# ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

**తేది:29.08.2017**

తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ద్రావిడ విశ్వవిద్యాలయం తెలుగు విభాగం అధ్వర్యంలో ఘనంగా వేడుకలను నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి గారి పుట్టిన రోజు సందర్భంగా జరుపుకుంటున్న తెలుగు భాషా దినోత్సవ కార్యక్రమానికి తెలుగు శాఖాధిపతి డా.చిన్నరెడ్డయ్య అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా విచ్చేసిన ద్రావిడ విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు ఆచార్య ఇ.సత్యనారాయణ గారు మాట్లాడుతూ... గిడుగు రామ్మూర్తి గారు తెలుగు భాషకు చేసిన సేవలను కొనియాడారు. అదేవిధంగా తెలుగు భాషకు, సాహిత్యానికి ఎనలేని సేవ చేసిన కందుకూరి, గురజాడ, శ్రీ నారాయణరెడ్డి మొదలైన వారి సేవలను స్మరించుకున్నారు. తెలుగు భాషాభిమాని అయిన తన రాష్ట్ర డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధ ప్రసాద్ గారు తెలుగు భాషకు నిరంతరాయంగా చేస్తున్న సేవలను కొనియాడుతూ ఇలాంటి తెలుగు భాషా సేవకులు అనేక మంది ముందుకు వచ్చి చిరకాలం తెలుగు భాష మనుగడకు కారకులు కావాలని కోరారు. విద్యార్థినీ విద్యార్థులు, పరిశోధకులు పోటీ పరీక్షకు తెలుగు సబ్జెక్టును ఆప్షనల్‌గా తీసుకుని ఉత్తీర్ణులై తెలుగు భాషకు, ప్రాంతానికి ఖ్యాతిని సంపాదించిపెట్టాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ప్రధాన వక్త ఆచార్య పులికొండ సుబ్బాచారి మాట్లాడుతూ... వ్యావహారిక భాషలో రచనకు అద్యుడైన గిడుగు రామ్మూర్తి మారుమూల ప్రాంతానికి చెందిన వాడైనప్పటికీ తెలుగు భాషపై పట్టు సాధించడమే కాకుండా సవర భాషాభివృద్ధికి తోడ్పడిన విధానాన్ని తెలియజేస్తూ సవర - ఇంగ్లీషు నిఘంటువును తయారు చేశారన్నారు. హేతువాది అయిన గిడుగు రామ్మూర్తి గారికి రావ్‌బహదూర్ బిరుదు పొందడానికి తోడ్పడిన అంశాలు భాషా సేవలు గురించి తెలిపారు. 1930లో జి.వి.క్రిష్ణారావు తెలుగు పిహెచ్.డిని ఆంగ్లంలో సమర్పించారని, 1969లో జి.ఎన్.రెడ్డి గారు తెలుగు పిహెచ్.డిని తెలుగులో మొట్టమొదట సమర్పించారని ఈ సందర్భంగా తెలిపారు. తెలుగు భాషను పాలకుల భాష, పాలితుల భాష వ్యత్యాసాన్ని తెలుపుతూ భాషకు ప్రజలను, ప్రాంతాలను విడదీసే శక్తి, కలిపే శక్తి ఉంటుందన్నారు. నిజాం ప్రభువు ఆనాడే తక్కువ పదజాలం కలిగిన ఉర్దూ భాషలోనే ఇంజనీరింగ్ విద్య మరియు వైద్య విద్యకు సంబంధించి పాఠ్యపుస్తకాలను ముద్రించి బోధించే వారని, కానీ ఈనాటికీ మనం తెలుగు భాషా దినోత్సవాలు అనేక ప్రభుత్వాల అధ్వర్యంలో జరుపుకుంటున్నప్పటికీ విస్తృతమైన పదజాలం కలిగిన తెలుగులో ఇంజనీరింగ్ విద్య, వైద్య విద్యలకు సంబంధించి తెలుగులో పాఠ్యపుస్తకాలను ముద్రించుకుని బోధించడానికి అనుకూలమైన పరిస్థితులు ఏమైవుంటాయో అన్నారు. విద్యార్థులు, పౌరులు, భాషాభిమానులు, ప్రభుత్వం ఎవరంతకు వాళ్ళు తెలుగు భాషా ఔనత్యానికి, మనుగడకు తెలుగు రచనలు చదువుతూ, తెలుగులో రాస్తూ, తెలుగును మాట్లాడుతూ, తమవంతు బాధ్యత వహించాలని కోరారు.

ఈ సందర్భంగా తెలుగులో సాహితీ ప్రశ్నావళి, వక్తృత్వం, వ్యాసరచన, పద్య రచన పోటీలను నిర్వహించి ప్రతి అంశంలోనూ ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ఉపాధ్యక్షులు ఆచార్య ఇ.సత్యనారాయణ గారు అందజేశారు.

ఈ కార్యక్రమంలో తెలుగు విభాగ అధ్యాపకులు, తెలుగు భాషాభిమానులు, తెలుగు పరిశోధక విద్యార్థులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.


తెలుగు శాఖ
గిడుగు జయంతి (ఆగష్టు 29)
తెలుగు భాషా దినోత్సవం
ముఖ్య అతిథి
ప్రధాన వక్త
ఆచార్య ఇ. సత్యనారాయణ గారు
ఆచార్య పులికొండ సుబ్బాచారి
ఉపాధ్యక్షులు
సభాధ్యక్షులు



